# యాదగిరీశుడికి వైభవంగా నిత్యోత్సవాలు



గుట్టలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో నిత్యోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాతం నుంచి పవళింపు సేవ వరకు స్వామి, అమ్మవార్ల నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవ, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు ఘనంగా నిర్వహించారు. సుదర్శన నారసింహ హోమం పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో సాగింది. ఉదయం ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శ నారసింహ హవనం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహన సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. సాయంత్రం అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవను కోలాహలంగా నిర్వహించారు. పరమ పవిత్రంగా నిర్వహించే సేవలో మహిళా భక్తులు పాల్గొని తరించారు. ముత్తయిదువులు మంగళ హారతులతో అమ్మవారిని స్తుతిస్తూ పాటలు పాడుతూ సేవ ముందు నడిచారు. తిరువీధి సేవ అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలోని ఊయలలో శయనింపు చేసి గంట పాటు వివిధ రకాల పాటలతో అమ్మవారిని కొనియాడుతూ లాలిపాటలు కోలాహలంగా కొనసాగింది. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.18,54,981 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా శరత్ పూర్ణిమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి 7గంటల నుంచి రాత్రి నివేదన వరకు స్వామి వారి బ్రహ్మోత్సవ కల్యాణ మండపం వద్ద శరత్‌పూర్ణిమ వేడుకలు చేపట్టారు.

### నేడు ఆలయం మూసివేత

పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 4గంటలకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంతో పాటు అనుబంధ ఆలయాలు మూసివేయనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనర్సింహాచార్యులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు అనుమతించనున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి 1.05గంటల నుంచి రాత్రి 2.22గంటల వరకు పాక్షి చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం 4గంటల లోపు తిరువారాధన, నివేదన, శయనోత్సవ పూజా కార్యక్రమాలు పూర్తి చేసి ప్రధానాలయం మూసివేస్తామని తెలిపారు. దీంతో పాటు సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భాగంగా శనివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించే 4వ బ్యాలను రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. చంద్రగ్రహణం ముగిసిన అనంతరం ఆదివారం తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సంప్రోక్షణ పూజలు నిర్వహించి భక్తుల దర్శనాలు, నిత్య కైంకర్యాలను పునరుద్ధరిస్తామని తెలిపారు.

# మునుగోడులో మరోమారు గులాబీ జెండా ఎగురవేద్దాం

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- బీజేపీ, సీపీఎం నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులతో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 27 : మునుగోడులో మరోమారు గులాబీ జెండా ఎగిరేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని గుజ్జ, సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన బీజేపీ, సీపీఎం కార్యకర్తలు 20మంది ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య, గ్రామ శాఖల అధ్యక్షులు లారీ భిక్షం, గంగదేవి సత్తయ్య, నాయకులు బొడ్డుపల్లి గాలయ్య, ఎడ్ల సత్తయ్య, జక్కిడి యాదిరెడ్డి, బాకరం వెంకటేశం, రాసాల వెంకటేశం, చిలువేరు కృష్ణయ్య, దూసరి వెంకటేశం, ఉష, రాచకొండ రాజు, ఏర్పుల సైదులు, పగిళ్ల శ్రీకాంత్, ఏనుగుల చిరంజీవి పాల్గొన్నారు.

# ప్రజలే బీఆర్‌ఎస్‌కు హైకమాండ్

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- పలు మండలాల నాయకులు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరిక



రాజాపేట : డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న సింగారం గ్రామస్తులు

యాదగిరిగుట్ట / రాజాపేట, అక్టోబర్ 27 : కాంగ్రెస్, బీజేపీకి హైకమాండ్ ఢిల్లీ నాయకులైతే.. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలే హైకమాండ్ అని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చామల ఉదయ్‌చందర్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చాడ గ్రామ అధ్యక్షుడు కూరెళ్ల నరేశ్, గౌరాయిపల్లి కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు, ఎమ్మార్పీఎస్ నాయకుడు వడ్లకొండ శ్రీకాంత్ మాదిగతో పాటు 1500మంది, రాజాపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబర్‌అలీ, వరిమడ్ల శ్రీను, సింగారం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రాల మహేందర్, కాంగ్రెస్ నాయకులు బత్తుల నర్సింహులు, బీజేపీ యూత్ మండలాధ్యక్షుడు కొలం శ్రీనివాసులు, యాదగిరిగుట్ట మండల లోంని తాళ్లగూడెం గ్రామం నుంచి బీజేపీ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని మహేశ్‌గౌడ్, సూదగాని సత్యనారాయణతో పాటు 100మంది, బొమ్మలరామారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేశ్‌నాయక్, రామోశ్‌నాయక్, మహబూబ్‌పేట గ్రామానికి చెందిన బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి పుల్లె నరేశ్, గాజుల నరేశ్, బాలకృష్ణ, తుర్కపల్లి మండలంలోని బిల్యాతండాకు చెందిన గుగులోత్ వెంకటేశ్, శ్రీకాంత్‌తో పాటు మరో100 మంది శుక్రవారం ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, మోటకొండూర్ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, తుర్కపల్లి ఎంపీపీ భూక్యా సుశీలారవీందర్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, బొట్ల యాదయ్య, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గడ్డమీది రవీందర్‌గౌడ్, సెక్రటరీ జనరల్ కసావు శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు ఆరే స్వరూపామల్లేశ్‌గౌడ్, ఈదులకంటి భాస్కర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ.బురాన్, అంజిరెడ్డి, యువజన విభాగం నాయకులు బీమగాని నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

# కేసీఆర్ సారే భరోసా




- సీఎం నేతృత్వంలో హ్యాట్రిక్ విజయం పక్కా
- రేపు ఆలేరులో ప్రజా ఆశీర్వాద సభ
- 50వేల మందికి పైగా హాజరవుతారని అంచనా
- ఆలేరు ఆడబిడ్డను నేను.. మరోసారి ఆశీర్వదించండి
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : 'సీఎం కేసీఆరే మా భరోసా. ఆయన సారథ్యంలో హ్యాట్రిక్ విజయం సాధించడం పక్కా. ఆదివారం ఆలేరులో ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు ముమ్మరం చేశాం' అని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం నమస్తే తెలంగాణతో మాట్లాడారు. ఆమె మాటల్లోనే..

### సెంటిమెంట్ కొనసాగింపు..

ఈ నెల 29న ఆలేరు పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నాం. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో అదే రోజు మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ సభ ఉంటుంది. 40 ఎకరాల్లో సభ ప్రాంగణం ఏర్పాటు చేయడం జరిగింది. గత రెండు దఫాలుగా ఇక్కడే సభను నిర్వహిస్తున్నాం. మూడోసారి కూడా సెంటిమెంట్‌తో ఇక్కడే ఏర్పాటు చేస్తున్నాం.

### తుది దశకు ఏర్పాట్లు..

సభకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. బహిరంగ సభ ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఇప్పటికే పలు సార్లు పరిశీలించాం. 50వేల కుర్చీలు వేయిస్తున్నాం. మైదానం పక్కనే హెలీప్యాడ్ ఏర్పాటు చేశాం. హెలీప్యాడ్‌ను అధికారులు సైతం పలు సార్లు పరిశీలించారు. చలికాలం నేపథ్యంలో ఒక వేళ చీకటి పడినా ఇబ్బంది లేకుండా ముందస్తుగా లైటింగ్ ఏర్పాటు చేస్తున్నాం. సభలో ఎల్ఈడీ స్క్రీన్లు పెడుతున్నాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాం.

### బొట్టుపెట్టి ఆహ్వానం..

ఇటీవల అన్ని మండలాల కీలక నేతలతో సమావేశం నిర్వహించాం. మహిళా నేతలతో భేటీ అయ్యాం. మహిళలు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి ప్రజా ఆశీర్వాద సభకు ఆహ్వానిస్తారు. జన సమీకరణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. గ్రామాలవారీగా ఇన్‌చార్జీలను నియమించాం.

### బలంగా బీఆర్‌ఎస్ సంస్థాగత నిర్మాణం..

సంస్థాగతంగా బీఆర్‌ఎస్ పార్టీ ఎక్కడా లేని విధంగా బలంగా నిర్మాణమైంది. 80వేల పైచిలుకు బీఆర్‌ఎస్ సభ్యత్వంలో రాష్ట్రంలోనే ఆలేరు నాలుగో స్థానంలో ఉంది. అన్ని కమిటీల పునర్నిర్మాణం కూడా చేశాం. విద్యార్థి, యువత, సోషల్ మీడియా తదితర కమిటీలన్నీ గ్రామీణ స్థాయిలో ఉన్నాయి.

### ఆలేరును ఎంతో అభివృద్ధి చేశాం..

ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు తీసుకొచ్చాం. యాదగిరిగుట్ట పునర్నిర్మాణం, మెడికల్ కాలేజీ, మూడు మినీ ట్యాంక్ బండ్లు, తుర్కపల్లి ఇండస్ట్రియల్ పార్కు, రోడ్లు, బునాదిగానీ కాలువను నిర్మించాం. సొంత నిధులు ఖర్చు పెట్టి డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. స్వచ్ఛందంగా సేవాకార్యక్రమాలు చేపడుతున్నాం. కేసీఆర్ కృషి వల్లే నియోజకవర్గంలో కరువు పోయి.. పచ్చని పొలాలతో అలరారుతున్నది. మరింత అభివృద్ధిపై సీఎంకు నివేదిస్తాం.

### దేశంలో లేని పథకాల అమలు..

కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయి. ప్రజలు కూడా చాలా సంతోషంగా ఉన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలు అమలవుతున్నాయి. రైతు బంధు, రైతు బీమా, 24గంటల కరెంట్, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, దళిత బంధు పథకాలు విజయవంతంగా నడుస్తున్నాయి.

### 50వేలకు పైగా వస్తారని అంచనా..

సీఎం కేసీఆర్ సభకు తరలివచ్చేందుకు నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆయన ప్రసంగాన్ని వినేందుకు స్వచ్ఛందంగా తరలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఒక్కో మండలం నుంచి ఐదు వేలకు పైగా బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నం. మండలానికి వంద డీసీఎంలలో సభకు తరలివస్తారు. 50వేలకు పైగా తరలివస్తారని అంచనా వేస్తున్నాం.

### మరోసారి ప్రజలు ఆశీర్వదించండి..

కేసీఆర్‌పై ఉన్న భరోసా వేరే ఇతర పార్టీలపై ఉండదు. 2001 నుంచి ఇప్పటి వరకు కేసీఆర్ వెంటే నడిచాం. ఆయన పైనే నమ్మకం, భరోసా. గత రెండు ఎన్నికల్లో ఆలేరు ప్రజలు మాపై నమ్మకం ఉంచి గెలిపించారు. ఈ సారి కూడా బ్రహ్మాండమైన మెజార్టీతో గెలబోతున్నాం. మీ ఆడబిడ్డకు మరోసారి ఆలేరు ప్రజల ఆశీర్వాదం కావాలి.